క్లుప్తంగా

పాఠ్యపుస్తకాల పంపిణీ



మానవపాడు: ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఎంఈఓ శివప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, లక్ష్మన్న, శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయండి

గద్వాల అర్బన్: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని కోరుతూ సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు మోహన్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ సరితకు వినతి పత్రం అందజేశారు. కార్పొరేట్ పాఠశాలలను నియంత్రించాలని, పేరెంట్స్ మీటింగ్ నిర్వహించాలని, నెలలో ఒక రోజు సైకాలజిస్టుల ద్వారా వెనుకబడిన విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని, వ్యాయమం ఉపాధ్యాయలను, క్రాఫ్ట్ టీచర్లను నియమించాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. వెంకట్‌స్వామి గౌడ్, ఈశ్వర్, రాము తదితరులు ఉన్నారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

ఎర్రవల్లిచౌరస్తా: ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న వసతులను వినియోగించుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని పోతురాజు శంకరమ్మ సేవాదళం ట్రస్ట్ చైర్మన్ సోమనాద్రి అన్నారు. శుక్రవారం ఎర్రవల్లి మండలంలోని కొండేరులో ఏర్పాటు చేసిన బడి బాట కార్యక్రమానికి ఆయన హాజరై ఉపాధ్యాయులతో కలిసి చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

అయిజ: విద్యుత్ సరఫరాలో సమస్యలను తొలగించేందుకు చేపడుతున్న మరమ్మతుల కారణంగా అయిజ, గట్టు మండలాల్లోని కొన్ని గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏడీఈ గోవిందు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అయిజలోని 132/11 కేవీ సబ్‌స్టేషన్ నుంచి వెళ్లే కేటీదొడ్డిలోని 33 కేవీ ఫీడర్‌కు మరమ్మతు చేసేందుకు అయిజ మండలంలోని 33/కేవీ, ఉత్తనూరు, చిన్న తాండ్రపాడు, తొత్తినోనిదొడ్డితోపాటు గట్టు మండలంలోని ఇందువాసి సబ్‌స్టేషన్‌లకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏడీఈ పేర్కొన్నారు. దీని కారణంగా అయిజ మండలంలోని ఉత్తనూరు, భూంపురం, ఈడుగోనిపల్లి, సంకాపురం, చిన్న తాండ్రపాడు, కేశవరం, వేణిసోంపురం, మేడికొండ, తుపత్రాల, తొత్తినోనిదొడ్డి, పులికల్, బైనపల్లి, సిందనూరు, కిసాన్ నగర్, రాజాపురం, మూగోనిపల్లిలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా గట్టు మండలంలోని ఇందువాసి, బోయలగూడెం గ్రామాల్లో కూడా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కాంగ్రెస్ కార్యకర్తకు నివాళి

మానవపాడు: మండలంలోని కలుకుంట్లలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కరుణాకర్‌రెడ్డి శుక్రవారం మృతి చెందారు. డీసీసీ సెక్రటరి మహ్మద్ సిరాజ్ అహ్మద్ మృతదేహనికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఇంటింటి సర్వే పరిశీలన

అలంపూర్ రూరల్: మండలంలోని లింగన్‌వాయిలో శుక్రవారం ఎంపీఓ ఖాజామోనోద్దీన్ మిషన్ భగీరథ సర్వే పరిశీలించారు. ఇందులో భాగంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు.

బీజేపీ నాయకుడికి ప్రశంసపత్రం

అయిజ: ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకుని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డికి హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో రాష్ట్ర రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ అజయ్ మిశ్రా చేతుల మీదుగా శుక్రవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డికి ప్రశంసపత్రం, మెమెంటో అందజేశారు. వాజ్‌పేయి జయంతి సందర్భంగా రామచంద్రారెడ్డి అనేక సార్లు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి 900 యూనిట్లకు పైగా దాతల ద్వారా రక్తం సేకరించారని కొనియాడారు.

కల్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

గద్వాల క్రైం: అక్రమంగా నిషేధిత కల్లును విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని 100 కల్లు ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ వీరేష్ తెలిపారు. శుక్రవారం మల్దకల్ మండలం బిజ్వారం చెందిన బోయ సత్యన్న నిషేధిత కల్లును గుట్టుగా గద్వాల పట్టణంలోని చింతలపేట కాలనీలో విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుడి నుంచి కల్లును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వర్షపాత నమోదుపై నిర్లక్ష్యం

- నామమాత్రంగా దర్శనమిస్తున్న నమోదు కేంద్రాలు
- వర్షపాత వివరాలను గాలికొదిలేసిన అధికారులు
- ఉన్నతాధికారులకు కాకి లెక్కలు



నిర్లక్ష్యంగా వదిలేసిన వర్షపాతం తెలిపే తొట్టి



వెంకటాపురం స్టేజిలో కంచె లేకుండా ఏర్పాటు చేసిన వర్షపాత నమోదు కేంద్రం

శాంతినగర్: వర్షపాత నమోదు కేంద్రాలు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. వానాకాలంలో ఆయా మండలాల్లో వర్షపాతం ఎంత నమోదైందో ఖచ్చితమైన సమాచారం లేకుండా పోతుంది. ఉన్నతాధికారులకు కాకి లెక్కలు చెప్పడంతో వర్షపాతంపై రైతులకు, ప్రజలకు ఖచ్చితమైన సమాచారం తెలియడంలేదు. ముఖ్యంగా రైతులకు ముందస్తు సమాచారం లేకపోవడంతో తీవ్ర నష్టాలను చవిచూస్తున్నారు. అలంపూర్ నియోజకవర్గంలోని 8 మండలాల్లో మండల కేంద్రాలు, ఆయా మండలాలకు మధ్యలో ఉన్న గ్రామాల్లో సుమారు 20 చోట్ల వర్షపాత నమోదు కేంద్రాలు ఏర్పాటు చేశారు. వానాకాలంలో ఏ రోజు ఎంత వర్షపాతం నమోదైంది. ఎంత గాలి వీచింది అనే సమాచారాన్ని ఉన్నతాధికారులకు నిత్యం చేరవేయాల్సిన బాధ్యత మండల స్థాయి అధికారులది. అలా కాకుండా నమోదు కేంద్రాలను గాలికొదిలేయడంతో కిందిస్థాయి సిబ్బంది ఎంత చెబితే అంత ఆరోజుకు నమోదు చేయడం పరిపాటిగా మారింది. దీంతో వాతావరణ శాఖ ద్వారా రైతులకు, ప్రజలకు ఖచ్చితమైన సమాచారం అందడం లేదు. ముందస్తు సమాచారం ఉంటే రైతులు విత్తనాలు వేసుకోవడానికి, విత్తనాలు సేకరించడం, కోత కోసిన ధాన్యాన్ని భద్రపరచడం లాంటి పనులు చేపడుతారు. ఈవిషయమై ఉన్నతాధికారులు స్పందించి ఆయా వర్షపాత నమోదు కేంద్రాలను ఉపయోగంలోకి తెచ్చి ఖచ్చితమైన సమాచారం రైతులకు, నియోజకవర్గ ప్రజలకు అందించేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

సమాచారం తెలియడం లేదు



మా స్టేజిలోని సబ్ స్టేషన్ వద్ద వర్షపాత నమోదు కేంద్రం ఏర్పాటు చేశారు. ఎలాంటి రక్షణ కంచె ఏర్పాటు చేయకపోవడంతో పశువులు, మేకలు చుట్టూ చేరుతుంటాయి. నీటిని తాగేస్తుంటాయి. అంతేగాక పైపును తోస్తూ ఉంటాయి. ఎప్పుడు వచ్చి పరిశీలిస్తారో, ఏమి సమాచారం తీసుకుపోతారో తెలియని పరిస్థితి వుంది.

– పెద్ద భీమన్న, రైతు, వెంకటాపురం

సమాచారం ఇస్తే జాగ్రత్త పడతాం



ఒక రోజు ముందు సమాచారం తెలిస్తే జాగ్రత్త పడతాం. వర్షం వస్తుందని తెలిస్తే విత్తనాలు, కాడెద్దులు సిద్ధం చేసుకుంటాం. ధాన్యం కల్లాల్లో నిల్వ చేసిన సమయంలో ముందస్తు సమాచారం తెలిస్తే కప్పి పెట్టుకుంటాం. ఎవరూ ఏమి చెప్పడం లేదు. వర్షాలు అకస్మాత్తుగా రావడం ధాన్యం తడవడం, గాలికి టార్పాలిన్‌లు ఎగిరిపోవడం జరుగుతుంది. ముందస్తు సమాచారం ఇస్తే రైతులకు నష్టం వాటిల్లదు.

– శివ, రైతు, పర్దిపురం

సమస్యల పరిష్కారానికి దరఖాస్తులివ్వండి



దరఖాస్తులను స్వీకరిస్తున్న సిబ్బంది

అయిజ: ప్రజాపాలన దరఖాస్తుల సమస్యల పరిష్కారానికై మున్సిపాలిటీలోని ప్రజలు దరఖాస్తులు ఇవ్వాలని కమిషనర్ సత్యబాబు తెలిపారు. దరఖాస్తులను స్వీకరించే కార్యక్రమం శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రారంభించారు. కమిషనర్ మాట్లాడుతూ. దరఖాస్తుల స్వీకరణకు మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తామని పేర్కొన్నారు.

అర్చకుడిని పరామర్శించిన ఉడిపి పీఠాధిపతులు

ధరూరు: ధర్మ జాగృతి యాత్రలో భాగంగా అయోధ్య శ్రీరామ మందిర ట్రస్టు ముఖ్యులు పెజావర శ్రీగలు శ్రీ విశ్వ ప్రసన్న తీర్థ స్వామీజీ, ఉడిపి పెజావర్ పీఠాధిపతి విశ్వప్రియ తీర్థ స్వామిజీలు మండల కేంద్రానికి శుక్రవారం వచ్చారు. ముందుగా పార్థసారథి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు ఆద్య కేశవాచార్యులు ఇంటిని సందర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం బెంగళూరుకు బయలుదేరి వెళ్లినట్లు తెలిపారు.



ఆద్య కేశవాచార్యులు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న పీఠాధిపతులు

ముున్సిపాలిటీలో విద్యుత్ వెలుగులు

అలంపూర్: స్థానిక మున్సిపాలిటిలోని కాలనీల్లో శుక్రవారం కొత్తగా ఎల్ఈడీ లైట్లను వేశారు. ఎంపీడీఓ ఆఫీస్ లైన్‌లో 4, అక్బర్‌పేట కాలనీలో 10, సంతోష్ నగర్ కాలనీలో 11, అంబేద్కర్ కాలనీలో 6 లైట్లు ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ సరస్వతి తెలిపారు. అయితే వాసవీ అన్నదాతన సత్రం లైన్‌లో 20 రోజులుగా లైట్లు లేకపోవడంతో చీకట్లో నడవడానికి కష్టంగా ఉందని కాలనీ వాసులు తెలిపారు. న్యూప్లాట్స్ కాలనీలో, 8వ వార్డులోని న్యూప్లాట్స్ కాలనీలోని మసీద్ ఎదురు కాలనీలో కొద్ది రోజులుగా లైట్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు కాలనీ వాసులు మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆ కాలనీల్లోనూ కొత్త లైట్లు వేస్తామని కమిషనర్ తెలిపారు.



అలంపూర్‌లో లైట్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

చిన్నారులను అంగన్‌వాడీకి పంపండి



మాచర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

గట్టు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పోషకాహారంతో పాటుగా విద్యను అందిస్తున్నట్లు అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు వాసంతి, సంధ్యారాణి తెలిపారు. అంగన్‌వాడీ బడిబాటలో భాగంగా శుక్రవారం మాచర్ల, పెంచికలపాడులో ర్యాలీ నిర్వహించారు. 3ఏళ్లకు పైబడిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రానికి పంపాలని, కేంద్రాల్లో చిన్నారులకు ఆట, పాటలతో చదువుపై దృష్టిని మళ్లించడం జరుగుతుందని తెలిపారు.

అయ్యప్పస్వామికి పడి పూజ



అలంకరణలో అయ్యప్ప స్వామి

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్పస్వామి ఆలయంలో ఉత్తరా నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం పడిపూజ ఘనంగా నిర్వహించారు. అర్చకుడు ఆంజనేయ శర్మ, ధర్మకర్త దామోదర్ రెడ్డితో కలిసి ఆలయంలోని అయ్యప్ప స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పడి పూజ, మొట్ల పూజలు విశేషంగా జరిగాయి.

ప్రహరీలు లేని పాఠశాల భవనాలు



ప్రహరీ లేని నాగర్‌దొడ్డి పాఠశాల

ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

మల్దకల్: ప్రభుత్వం పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు రూ.లక్షలు వెచ్చించి భవనాలు నిర్మిస్తున్నా వాటికి ప్రహరీలు లేకపోవడంతో పశువులు, పందులు సంచరించడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మల్దకల్, గట్టు, కేటీదొడ్డి, ధరూరు, గద్వాల మండలాల్లోని కొన్ని ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేవు. మల్దకల్ మండలంలో మొత్తం 10 జెడ్పీ హెచ్ఎస్, 4 యూపీఎస్, 27 పీఎస్‌లు ఉండగా వాటిలో 6,248 మంది విద్యార్థులు విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. వీటిలో కొన్ని పాఠశాలలను కొత్తగా రూ.లక్షలు వెచ్చించి భవనాలు నిర్మించిన వాటికి ప్రహరీలు నిర్మించకపోవడంతో ఆవరణలంతా అపరిశుభ్రంగా మారుతున్నాయి. నాగర్‌దొడ్డి, నీలిపల్లి, ఎద్దులగూడెం, దాసరపల్లి, బిజ్వారం, చిప్పదొడ్డి, విఠలాపురం పాఠశాలలతో పాటు మల్దకల్ కస్తూర్బా పాఠశాలకు ప్రహరీ లేదు. దీనికి తోడు వర్షాకాలంలో వర్షపునీరు పాఠశాల ఆవరణలోకి చేరడంతో పాఠశాల ఆవరణ మొత్తం అపరిశుభ్రంగా తయారవుతుందన్నారు. ప్రహరీలు ఉన్న మరికొన్ని పాఠశాలలు గేట్లు లేకపోవడంతో వాటి పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. కస్తూర్బా బాలికల పాఠశాలతో పాటు ఎద్దులగూడెం, బిజ్వారం పాఠశాలల ఆవరణ ముందు ప్రధానరహదారులు ఉండటంతో విద్యార్థులు ఎప్పుడు రహదారుల పైకి వెళ్లి ఏ ప్రమాదం జరుగుతుందోనని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు.



ప్రహరీ లేని నీలిపల్లి పాఠశాల

ఇబ్బందులు పడుతున్నారు



మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ఆవరణలో పశువులు, గొర్రెలు, పందులు సంచరిస్తూ అపరిశుభ్రం చేస్తున్నాయి. ప్రహరీ నిర్మించి సమస్యను పరిష్కరించాలి.

–రామలింగం, మల్దకల్

ప్రహరీ మరిచారు



నాగర్‌దొడ్డిలో ప్రభుత్వం కొత్తగా నిర్మించిన పాఠశాల భవనానికి ప్రహరీ నిర్మించలేదు. రూ.లక్షలు వెచ్చించి భవనం నిర్మించిన అధికారులు ప్రహరీ నిర్మించడంపై దృష్టి సారించడం లేదు.

– సోమన్న, నాగర్‌దొడ్డి

చర్యలు తీసుకుంటాం



మండలంలోని పలు గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీలు లేని విషయమై ఉన్నతాధికారులకు నివేదిస్తాం. నిధులు మంజూరైన వెంటనే ప్రహరీలు నిర్మించి పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

–సురేష్, ఇన్‌చార్జి ఎంఈఓ, మల్దకల్

అధికారుల మధ్య సమన్వయం ముఖ్యం



ధరూరులో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సరిత

ధరూరు: ఆయా శాఖల అధికారుల మధ్య సమన్వయం కొరవడిందని, అన్ని శాఖలు కలిసి పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ మీటింగ్ హాల్‌లో ఎంపీపీ నజీమున్నీసా బేగం అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. అన్నింటికీ మూలాధారమైన విద్యపై ప్రతి ఒక్కరు దృష్టి సారించాలని సూచించారు. విద్యా వలంటీర్ల నియామకాన్ని ప్రభుత్వం త్వరలోనే చేపడుతుందని, అప్పటి వరకు గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు దాతల సాయంతో కూడా విద్యావలంటీర్లను నియమించవచ్చునని చెప్పారు. ముఖ్యంగా అంగన్‌వాడీ టీచర్లు లేని చోట ఐసీడీఎస్ అధికారులు ప్రత్యేక దృష్టిసారించి అవి సవ్యంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాల్లో రైతులకు ఎలాంటి కోతలు లేని విద్యుత్ అందించాలన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ రాదని అపవాదు ఉందని, అలాంటిదేమి లేదని రుజువు చేసేందుకు 24 గంటల కరెంట్ ఇచ్చి చూపించాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ప్రస్తుత సీజన్‌లో ప్రజలు వివిధ రోగాల బారిన పడే అవకాశాలు ఉన్నందున గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో మహిళల ప్రసవాల సంఖ్య మరింత పెంచాలన్నారు. కుక్క, పాము కాటు మందుల నిల్వలపై వైద్య సిబ్బందితో మాట్లాడారు. ప్రస్తుతం కుక్క కాటు మందులు మాత్రమే అందుబాటులో ఉన్నాయని, పాము కాటుకు మందులు జిల్లా ఆస్పత్రుల్లోనే ఉంటాయని వైద్యాధికారి తెలిపారు. అత్యంత ప్రమాదకారి అయిన ప్లాస్టిక్‌పై పంచాయతీ కార్యదర్శులు విస్తృతంగా తనిఖీలు చేపట్టాలన్నారు. డయాలసిస్ రోగుల సంఖ్య జిల్లాలో రోజు రోజుకు పెరుగుతోందన్నారు. అందుకు గల కారణాలను పసిగట్టి వాటిపై తగు కార్యాచరణ తయారు చేయాలన్నారు. ప్రధానంగా అమాయక ప్రజలకు పెయిన్ కిల్లర్ ట్యాబ్లెట్లు అంటగట్టి తద్వారా కిడ్నీ సంబంధ రోగాల బారిన పడేందుకు కారణమవుతున్నారన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనేక పథకాలను తీసుకు వచ్చారన్నారు. అందులో భాగంగానే ఏదైనా అధికారిక సమావేశాలకు అవసరమైన ఫుడ్ ఆర్డర్‌ను మహిళా సంఘాలకే ఇవ్వాలన్నారు. ఈ ప్రక్రియ జిల్లా కేంద్రంలో ప్రారంభించామని తెలియజేశారు. అంతకు ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని వాకౌట్ చేస్తున్నట్లు వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ప్రకటించారు. అనంతరం సమావేశం యాథావిధిగా కొనసాగింది. కార్యక్రమంలో జెడ్పీటీసీ పద్మ, ఎంపీడీఓ మంజుల, ఎంపీఓ కృష్ణమోహన్, సీనియర్ అసిస్టెంట్ ఆనంద్ అధికారులు పాల్గొన్నారు.

రక్తదానం గొప్పది

మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి జెడ్పీ చైర్‌పర్సన్ హాజరై మాట్లాడారు. రక్తం ఎంతో విలువైనదని, యువకులు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

గద్వాల: ప్రతి ఒక్కరికి విద్య అవసరమని, విద్యలో రాణించినప్పుడు ఉజ్వల భవిష్యత్‌కు బాటలు పడుతాయని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత పేర్కొన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కొత్తపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన అక్షరభ్యాసం కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతుందని, ఉపాధ్యాయులపై నమ్మకం ఉంచి పిల్లలను చేర్పించాలన్నారు. నిష్ణాతులైన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో కృత్యాధార బోధన అమలవుతోందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలోనే ప్రతిభ గల ఉపాధ్యాయులు ఉంటారని, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తించాలన్నారు. ప్రైవేట్ కంటే ప్రభుత్వ బడుల్లోనే అత్యధిక ఉత్తీర్ణత సాధిస్తున్నారని వివరించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి, పిల్లల తల్లిదండ్రులు భాగస్వామ్యం కావాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు యూనిఫాం, పాఠ్య పుస్తకాలు అందజేశారు. అనంతరం పిల్లల చేత అక్షరభ్యాసం చేయించారు. కార్యక్రమంలో డీఈఓ ఇందిర, ఎంఈఓ సురేష్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం వెంకటనర్సయ్య, సెక్టోరియల్ అధికారి హంపయ్య, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధరూరులో భారీ వర్షం



ధరూరులో కురుస్తున్న వర్షం

ధరూరు: మండలంలో శుక్రవారం రాత్రి 7:30 గంటల నుంచి 8:30 వరకు భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో వాన దంచి కొట్టింది. గంట పాటు కుండపోత వాన కురిసింది. కురిసిన వర్షం ముంగారు పంటల సాగుకు అనుకూలంగా ఉందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇంకా సాగు కాని మెట్ట పంటల్లో విత్తనాలు వేసుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో, ఎర్రవల్లిచౌరస్తాలో శివాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం అర్చకులు అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.



కొత్త వస్తువు ఆర్డర్ ఇస్తే.. పాతది వచ్చింది!

శాంతినగర్: మోటార్ సైకిల్‌కు సంబంధించిన వస్తువు కొత్తది కావాలని ఆన్‌లైన్‌లో ఆర్డర్ ఇస్తే పాతది పంపారని శాంతినగర్‌కు చెందిన ఓ మెకానిక్ వాపోయాడు. వివరాల్లోకి వెళితే పట్టణానికి చెందిన మెకానిక్ రవి మోటార్‌సైకిల్‌కు సంబంధించిన డూమ్ కొత్తది కావాలని ఈనెల 7న ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో ఆర్డర్ చేశాడు. శుక్రవారం పార్సిల్ వచ్చింది. డెలివరి బాయ్ డబ్బులు ఇవ్వాలని అడగ్గా మెకానిక్ తమ్ముడు డబ్బులు తీస్తుండగా పార్సిల్ సీల్ తీసి చూశాడు. పాత వస్తువు రావడంతో అవాక్కయిన మెకానిక్ డెలివరి బాయ్‌ను అడగ్గా వెంటనే పార్సిల్ తీసుకుని వెళ్లిపోయాడు. కొందరు వచ్చిన పార్సిల్‌ను తీసి చూడకుండానే డబ్బులు ఇచ్చి పంపుతారు. తర్వాత ఇబ్బంది పడాల్సి వస్తుందని, ఇలాంటి మోసాలకు గురవకుండా ఆర్డర్ వచ్చిన వెంటనే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని మెకానిక్ సూచించాడు. అంతేగాక ఇలాంటి మోసాలకు పాల్పడే కంపెనీలపై చర్యలు తీసుకోవాలని మెకానిక్ కోరాడు.

అనారోగ్యంతో మహిళ మృతి

ఎర్రవల్లిచౌరస్తా: అనారోగ్యంతో మహిళ మృతి చెందిన ఘటన ఎర్రవల్లి మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాలు ఇలా.. వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన అనిత (36) కొంత కాలంగా చెత్త కాగితాలు సేకరిస్తూ మండల కేంద్రంలో అక్కడక్కడ ఉంటూ జీవనం సాగించేంది. ఈ క్రమంలో కూడలిలోని ఓ దుకాణం ఎదుట గురువారం రాత్రి పడుకొని నిద్రలోనే అకాల మరణం చెందింది. ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా.. మృతురాలి వివరాలు సేకరించి కుటుంబ సభ్యులను రప్పించారు. బాధిత కుటుంబ ఆర్థిక పరిస్థితి సక్రమంగా లేకపోవడంతో స్థానిక దాతల సహకారంతో జీపీ సిబ్బంది, కుటుంబ సభ్యులతో కలిసి ఇటిక్యాల పోలీస్ సిబ్బంది స్థానిక శ్మశానంలో అంత్యక్రియలను నిర్వహించారు.